
ఆంధ్ర వాహిని (అట్టావా) నిర్వహించిన

1988 శ్రీరామ నవమి కథల పోటీలో

సాధారణ ప్రచురణకి ఎన్నికైన కథ



# మరికింకా రోజులున్నాయ్

—డాక్టర్ వాడవల్లి చక్రపాణిరావు

సమయం అయిదుగంటలుదాటి, అంతా ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయినా నేను మాత్రం నా సీటులోనే కూర్చుని, హైదరాబాద్ తీసుకు వెళ్ళ వలసిన ముఖ్యమైన కాగితాలు సరిచూసుకుంటున్నాను. మా స్టాఫ్‌కు మూడు నెలలుగా జీతాలు లేవు. గ్రాంటు రాలేదు. ఏ నెలకానెల బిల్స్ పంపుతున్నా అట్నుంచి మాత్రం సమాధానం లేదు.

అందువల్ల మా ఆఫీసరు గారు హైదరాబాదు వెళ్ళి పనులు పూర్తి చేసుకు రమ్మని నన్ను పంపుతున్నారు. మూడు నెలల బిల్సూ, మరికొన్ని పెండింగులో వున్న కేసులకు సంబంధించిన కాగితాలూ హైదరాబాద్‌లో కలుసుకోవలసిన వారికి మా ఆఫీసరు గారి నుంచి రిక్వెస్ట్ లెటర్సూ — అన్నీ వచ్చాయో లేదోనని ఒకటికి రెండుసార్లు చూసుకొంటున్నాను.

"మూర్తి బాబూ!" అని మెల్లిగా వినిపించింది ఎక్కడి నుంచో. తల త్రిప్పి అన్ని వైపులా చూశాను.

వెనుక వైపున గోడకు ఒక మూలగా చేతులు కట్టుకుని నవ్వుతూ నిలబడి వున్నాడు కిష్టయ్య.

ఆశ్చర్యంగా అతనికేసి చూశాను.

కిష్టయ్య మా ఆఫీసులో చాలా కాలంగా పని చేస్తున్నాడు. ఎటెండెరుగా ఈమధ్యనే రిటైరయినా, అతణ్ని విడిచిపెట్టడం యిష్టం లేక మావాళ్ళు కంటింజెంట్ స్టాఫ్‌గా కంటిన్యూ చేస్తున్నారు. చాలా మంచివాడు. తన పనేదో తాను చేసుకుపోతాడు గాని, ఏ విషయమూ పట్టించుకోడు.

"ఏం కిష్టయ్యా?" అన్నాను.

"తమరు హైదరాబాదు వెళ్తున్నారంట గదా, నాకో చిన్న ఉపకారం చేస్తారేమోనని..." నసుగుతూ బుర్ర గోక్కున్నాడు.

"నీ పెన్షన్ విషయమేనా? ఇవిగో ప్రపోజల్సు కాపీలు తీసుకువెడుతున్నాను. తప్పకుండా ప్రయత్నిస్తాను. సాధ్యమైనంత త్వరలో వచ్చేలా చూడమని చెబుతాను" అన్నాను.

"నా పెన్షనుకేమొచ్చెలెండయ్యా - వచ్చినప్పుడే వస్తుంది. తమరు మరోలా అనుకోకపోతే ఒక చిన్న జాబునిస్తాను. దాన్ని తమరు సుబ్రమణ్యం బాబు గారికి అందజేయాలి" అంటూ కవరు ఒకటి నా చేతుల్లో ఉంచాడు.

"సుబ్రమణ్యం గారంటే...? ఏ సెక్షనూ...?"

"ఆరేనండయ్యా - తమరిప్పుడు వెళ్ళి కలుసుకో బోతున్నారే, ఆరే!" అన్నాడు.

అదిరిపోయాను.

"ఎవరు? డిప్యూటీ డైరెక్టరు సుబ్రమణ్యం గారా?"

"ఆరి దగ్గర నేను కొన్నాళ్ళు పని చేశానండయ్యా. పైకి కోపంగా ఉంటారు గానీ చాలా మంచోరండీ. మన ఆఫీసరు గారు, ఆరూ స్నేహితులంట గదండీ - అయ్య గారు ఉత్తరం రాసిచ్చి ఆర్ని కలుసుకుని, పని పూర్తి చేసుకు రమ్మంటం ఇన్నానండీ. కిట్టయ్య యిచ్చాడని ఈ, ఉత్తరం కూడా ఆరికియ్యండయ్యా, నేనెటూ అంత దూరం వచ్చి ఆరి దర్శనం చేసుకోలేను - తమరు మరోలా అనుకోకండి. ఈ సంగతి మరెవ్వరికీ తెలియనీకండి" అన్నాడు.

"సుబ్రమణ్యం గారు చాలా స్ట్రిక్టు మనిషట గదూ! ఇది చూసి ఏమీ అనుకోరంటేనే యిస్తాను కిష్టయ్యా!"

నా భయం నాది. మా ఆఫీసరు గారే భయపడుతూ భయపడుతూ ఉత్తరం వ్రాసిచ్చారు - మేమంతా చాలా ఇబ్బందుల్లో ఉన్నామనీ తప్పనిసరై మనిషిని పంపవలసి వస్తోందనీ, సహృదయంతో పనులు సానుకూలం చేసి పెట్టవలసిందనీ బతిమాలుతూ వ్రాశారు. అలాంటిది కిష్టయ్య తన 35 ఏళ్ళ సర్వీసులో ఎంతమంది ఆఫీసర్ల దగ్గరో పని చేసి ఉండవచ్చు. వాళ్ళందరికీ ఇతడు జ్ఞాపకం ఉంటాడా అని నా అనుమానం.

"అనుకునేందుకే ముందండయ్యా యిందులో? ఆరికి ఈలయితే అలాగేలే చూద్దాం అంటారు. లేపోతే ఎర్రి ముండావోడు ఏదో రాశాడులే అని నవ్వుకునూరు



కుంటారు. పోస్టులో మైడం అంత మంచిది కాదని... మీరెలానూ ఎల్తున్నారు గదాని యిచ్చాను, అంతే..." అన్నాడు మొహమాటపడుతూ.

"ఏ ఉత్తరం తీసుకువెళ్ళడం నాకేం బరువా? భారమా? తప్పకుండా యిస్తాను కిష్టయ్యా! నేనెటూ వెళ్ళి కల్సుకోవలసింది వారినే గదా!" అన్నాను అతని మాటల్తో ధైర్యం వచ్చి.

కిష్టయ్య వెళ్ళిపోయాడు.

నేను హైదరాబాద్ వెళ్ళి తిరిగి రావడానికి నాలుగు రోజులు పట్టింది. నేను వచ్చే సరికి కిష్టయ్య లేడు - ఆఫీసు పని మీద ఎక్కడికో వెళ్ళాడట. రావడానికి మరో మూడు నాలుగు రోజులు పడుతుందట. ఎప్పుడెప్పుడు కిష్టయ్యను కలుసుకుని విషయం చెబుదామాని ఆతురత తో ఉన్న నాకు కిష్టయ్య ఊళ్ళోనే లేడనే సరికి నీరసం వచ్చింది.

సుబ్రమణ్యం గారికికిష్టయ్యంటే ఎంత అభిమానం! అతని పేరు చెప్పి ఉత్తరం ఇవ్వగానే ఆయన ముఖం ఎంత ప్రసన్నంగా మారింది!

అమాయకుడిలా కనిపించే ఈ కిష్టయ్య ఎంతటి అసాధ్యుడు! ఆయన వద్ద అంతటి పలుకుబడి ఉందని ఎవ్వరితోనూ ఏనాడూ మాట మాత్రంగానైనా అని యెరుగడు గదా!

ఇంతకీ ఆ ఉత్తరంలో అతడేం వ్రాశాడో? ఆయన గారేం చేశారో? నా కుతూహలాన్ని పట్టలేకుండా ఉన్నాను. కిష్టయ్య ఎప్పుడెప్పుడు వస్తాడాని వెయ్యి కళ్ళతో ఎదురు చూశాను.

ఎలాగైతేనేం, మరో నాలుగు రోజులు పోయాక కిష్టయ్య ఆఫీసుకు వచ్చాడు. ఆ రోజు నేనే వెళ్ళి పలకరించి విషయం చెబుదామనుకొంటూ వుండగా, నేను ప్రక్కకు రావడం కనిపెట్టి కిష్టయ్యే వచ్చి నన్ను పలుకరించాడు.

"మూర్తి బాబు గారూ! చూశారా, ఆ మారాజు ఎంతటి ధర్మప్రభువో!" అన్నాడు నవ్వుతూ.

అతడు ఎవరి గురించి అంటున్నాడో నాకేమీ బోధ పడలేదు. అర్థం కానట్లు చూశాను అతనికేసి.

"తమరు అక్కణ్ణుంచి తిరిగి రాకుండగానే నా పనై పోయిందండీ" అన్నాడు.

అతడు చెబుతోంది సుబ్రమణ్యం గారి గురించేనని అప్పటికి తలకెక్కింది. 'అవునూ, పని అయిపోవడమే మిటి? అయిపోయినట్లుగా అప్పడే యితనికెలా తెలిసింది? నేనింకా యితనికి ఏ సంగతి చెప్పందే...?'

అంతలోనే కిష్టయ్య మొదలు పెట్టాడు.

"అయ్యగారు ఆఫీసు పనిమీద రాజమండ్రి పంపి రండీ నన్ను. నా పని చూసుకొంటూ మధ్యలో ఒకసారి ఆయమ్మగారెలా ఉన్నారో సూద్దారని ఎల్లానండీ. ఆమె గారు మహా సంబరపడిపోతూ సెప్పారండీ, 'కిట్టయ్యా! నీ దయ వల్ల అబ్బాయికి పోస్టింగు అయ్యింది - ఇక్కడే వేశారు - మా కట్టాలింక గట్టెక్కినట్టే' అంటూ ఎంతో యిదిగా సెప్పారండీ -'పోనీలేండమ్మా! దేవుడు సల్లగా సూశాడు తమర్ని - ఆ మహానుభావుడి పున్నెం ఈనాటికి ఫలించింది' అని చెప్పి అబ్బాయి గార్ని కూడా సూసి జాగర్తగా, తండ్రి గారికి సుల్లేనే కట్టపడి పనిజేస్తూ మంచిపేరు తెచ్చుకోండని సెప్పి సక్కా వచ్చానండీ" అన్నాడు.

కిష్టయ్య సాధారణంగా మాట్లాడడు. మాట్లాడితే అతని మాటలు పొడుపు కథల్లా ఉంటాయి. అర్థం చేసుకోడానికి ఎంతో ఓపిక ఉండాలి. తొందరపడి మనం వివరాలడిగితే అతను మాట్లాడటమేఆపేస్తాడు.అతనితో నాకున్న కొద్దిపాటి అనుభవంతోను నేను అతని మాటలకు అడ్డు పడకూడదని తెలుసుకున్నాను. అందు వల్ల నవ్వుతూ అతని ముఖంకేసి చూస్తూ ఉండి పోయాను.

"ఆరేనండి బాబూ! మ వాసీసులోసూసర్నెంటుగా సేస్తూ పోర్టులాకు వచ్చి మూడేళ్ళ క్రితం పోయారు సూడండీ, సూర్నారాయణ మూర్తిగారు - ఆరు పోయాక ఆయమ్మ గారూ, అబ్బాయి గారూ రాజమండ్రి ఎల్లి పోయారండీ. ఆ యిల్లాలు మహాసాధ్వండీ - అప్పుట్నుంచి నానా కట్టాలూ పడీ, పిల్లాడి సదువు పూర్తి సేయించేశా రండీ - ఏడాది క్రితం అబ్బాయికి మైనార్టీ తీరిపోయి తండ్రిగారి ఉద్యోగం తనకిప్పించమని దరఖాస్తు సేసు కున్నారటండీ - ఎవరున్నారండీ ఆరికి పాపం? ఎంత కొట్టుకున్నా కాయితం కదల్టమే కట్టమైపోయిందటండీ - ఆ మద్దెనోసారి అమ్మగారి దర్శనానికని ఎల్తే ఆమె పాపం ఎంతో బాధపడుతూ సెప్పుకొని కళ్ళ నీళ్ళు పెట్టుకున్నా రండీ, 'ఎవరివల్ల నవుద్ది తల్లీ మీ పని?' అని అడిగితే, సుబ్రమణ్యం గారి పేరు సెప్పారండీ. 'సరలాగయితే నాక్కాస్త అబ్బాయి గారి వివరాలు రాసియ్యండి! సనవు ద్దేమో సూద్దాం' అన్నాను. ఆమె గారు రాయించి యిచ్చారు. అనుకోకుండా తమరికి హైదరాబాదులో పని తగలడం, అయ్యగారి అనుగ్రహంతో అబ్బాయి గారికి పోస్టింగు ఆర్డరు వెంటనే వచ్చేసిందండీ - ఆ మహా తల్లి పరమానందపడి పోతున్నారు బాబూ! ఇందులో మనం సేసిందేముంది సెప్పండి - ఆ సూర్నారాయణ మూర్తి గారు దేవుడిలాటి మనిషి, తమరెరుగుదురు గదూ! పది మందికి తన వల్లనైన సాయం ఏదన్నా ఉంటే సేసి పెట్టారే గానీ ఏనాడూ ఎవరి దగ్గిరా పది రూపాయలకి ఆశించి ఎరుగరు ఆ బాబు. ఆ తండ్రి బిడ్డకి తిండే లేకుండా పోతుందాండీ అయ్యా! ఎవరి పున్నెం ఆరికి రక్ష గదండీ!" అతని మాటలలా సాగిపోతున్నాయి.

ఏమెరుగనట్టుండే కిష్టయ్య ఎంత లోతైన మనిషి! అందుకేనేమో డిప్యూటీ డైరెక్టరు సుబ్రమణ్యం గారు అన్నిసార్లు అడిగారు - 'కిష్టయ్య ఎలా ఉన్నాడు? - కిష్టయ్య పెన్షన్ పెటలయ్యిందా? కిష్టయ్య యోగిలాంటి



వాడయ్యా, అతని పని అయిపోయినట్లేనని చెప్పు' అంటూ.

ఏనాటి సూర్యనారాయణ మూర్తి గారు? మేమం దరం ఎప్పుడో ఆయన్ని మర్చిపోయాం. దిక్కు లేని ఆ సంసారం పట్ల కిష్టయ్యకి ఎంతటి బాధ్యత! చండ శాసనుడనబడే సుబ్రమణ్యం గారికి కిష్టయ్య పట్ల ఎంత ఆదరం! మంత్రులు చెప్పినా వినని వారు కిష్టయ్య మాటకి అంతటి విలువ యిచ్చి ముక్కూ మొహం తెలియని కుర్రాడికి వెంటనే ఉద్యోగం యిచ్చారంటే ఈ లోకంలో మంచికింకా రోజులున్నాయ్, సందేహం లేదు.




గుళ్ళో పురాణం జరుగుతోంది.

"కరెంటు పోతే బావుణ్ణు...కరెంటు పోతే బావుణ్ణు...కరెంటు పోతే బావుణ్ణు...కరెం..." గొణుక్కుంటున్నాడు ఒకాయన. అది విన్న పక్కాయన "కరెంటు పోతే బావుణ్ణంటు న్నావ్... నీకేం లాభం......" అనడిగాడు.

"పైన ఫేను మీద నా పేరెవరూ గమ నించడంలేదు" అన్నాడాయన.

- సోమన శివరామ ప్రసాద్, రాజమండ్రి

"ఏమండీ, ఈ టేబుల్ ఫ్యాన్ చూశారా ఎంత బాగుందో! ఈ రోజే కొన్నాను" అంది గొప్పగా పంకజం.

"అలాగా, ఎంతేవిటి?" భర్త అడిగాడు.

"నేనేం దుబారా మనిషిలా కన్పిస్తున్నానా మీకు? ఒక్క పైసా కూడా ఇవ్వకుండా పెళ్ళినాటి మీ సూటు, నా చీరా పారేసి సాధించా యీ వెంచా" చెప్పింది పంకజం గర్వంగా.

అంతే! ఆవిడ మొగుడు మరి లేవలేదు!

- కె. రమాప్రభాకర్

